క్లుప్తంగా

రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి



మంత్రి వనితకు శ్రీవారి మొమెంటోను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు జ్యోతి శ్రీనివాస్

ద్వారకాతిరుమల: తెలుగు నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత ఆకాంక్షించారు. మంగళవారం ద్వారకాతిరుమల చినవెంకన్నను, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆమెకు వేద ఆశీర్వచనాన్ని, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఆ తరువాత స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్ మంత్రి వనితకు శ్రీవారి మొమెంటోను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉగాది పండుగనాడు స్వామివారిని దర్శించి, ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు తదితరులున్నారు.

దుస్తులు, నిత్యావసరాల పంపిణీ



పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

చింతలపూడి: రంజాన్ పండుగను పురస్కరించుకుని జమా అతె ఇస్లామి హింద్, అంజుమన్ మహాఫిజుల్ ఇస్లాం కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పేద ముస్లింలకు దుస్తులు, బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మస్జీద్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌డీ రహీం(బాబు), జమా అతె ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే హుస్సేన్ మాట్లాడుతూ తమ సంస్థకు విరాళాలు, ఫిత్రాల రూపంలో అందిన సొమ్ముతో సుమారు 200 మంది పేద ముస్లింలకు కొత్త దుస్తులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మస్జీద్ కమిటీ కార్యదర్శి ఎండీ జిలాని, ఎంఏ రజాక్, ఖిజర్‌పాషా, ఇషాక్, గఫార్, ఫారూఖ్, సుబాని, జవహర్, యాకూబ్, ఎస్‌డీ నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి అయ్యప్ప దేవస్థానం వార్షికోత్సవం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానం 11వ వార్షిక వేడుకలు ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ తమ్మన వెంకటేశ్వరరావు తెలిపారు. ఈమేరకు మంగళవారం అయ్యప్ప క్షేత్రంలో వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 20వ తేదీ నుంచి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల సత్యవేణి, బీసీ రెడ్డిక డైరెక్టర్ దల్లి జ్యోతిక రెడ్డి, ఆధ్యాత్మికవేత్త ఈమని శశికుమార్, పాలపర్తి శ్రీనివాస్, అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సూర్యచంద్రరావు, గంగు జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


'పోలవరంలో మహిళా నేత చరిత్ర సృష్టిస్తుంది'



నరసింహ శర్మను సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పోలవరం నియోజకవర్గంలో మొట్టమొదటిసారిగా మహిళా నేత రాజకీయాల్లో చరిత్ర సృష్టించబోతోందని బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహ శర్మ పేర్కొన్నారు. కాణ్వ విద్యాపీఠాధిపతిగా ఆయన మంగళవారం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఆమెకు రాజకీయాల్లో ఉజ్వల భవిష్యత్తు ఉందని అన్నారు. అంతేకాకుండా ప్రస్తుత ప్రభుత్వమే మళ్లీ పాలనలోకి వస్తుందని, జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి రాష్ట్రానికి సారథ్యం వహిస్తారని జోస్యం పలికారు. ఈ సందర్భంగా పాలకమండలి చైర్మన్ మద్దు గోపి, విశాలాక్షి దంపతులు నరసింహ శర్మను శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఆగని మూగజీవాల తరలింపు



సీతారామపురం గ్రామంలో ఉంచిన పశువులు

కుక్కునూరు: గోదావరి మీదుగా మూగజీవాల తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. ఒరిస్సా, చింతూరు, ఛత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాల్లో ఆవులను, ఎద్దులను కొనుగోలు చేసి వాటిని గోదావరి మీదుగా మండలానికి తరలిస్తున్నారు. అనంతరం ఇక్కడి నుంచి అశ్వారావుపేటకు తరలించి అక్కడి నుంచి ఇతర ప్రాంతాల్లోని కబేళాలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. సోమవారం రాత్రి కూడా కొందరు మూగజీవాలను గోదావరి నది దాటించి సీతారామపురం గ్రామంలో ఉంచారు. అధికారులు పట్టించుకోకపోవడంతో మూగజీవాల తరలింపు యథేచ్ఛగా సాగుతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

అంతర్గత రహదారులకు మహర్దశ

- టీడీపీ హయాంలో అధ్వానంగా గ్రామాల్లోని రహదారులు
- 'గడపగడపకు' కార్యక్రమంలో మొరపెట్టుకున్న ప్రజలు
- ప్రతి సచివాలయానికి రూ.40 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం
- గ్రామాల్లో దాదాపు పూర్తయిన సీసీ రోడ్ల పనులు



జైనవారిగూడెంలో సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే బాలరాజు (ఫైల్)



బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో నిర్మించిన డ్రెయినేజీ



బుట్టాయగూడెం: టీడీపీ హయాంలో అధ్వానంగా మారిన గ్రామాల అంతర్గత రహదారుల అభివృద్ధిపై పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో గత ఐదేళ్లలో పలు గ్రామాల్లోని అంతర్గత రహదారులను సీసీ రహదారులుగా అభివృద్ధి చేశారు. దీంతో ఊళ్లల్లో గ్రామస్తుల పడుతున్న రహదారుల కష్టాలు తీరాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు గ్రామాల అభివృద్ధిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇందుకోసం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రవేశపెట్టి ప్రజాప్రతినిధులను గ్రామాల వద్దకు పంపి వారి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. వెంటనే గ్రామాల్లోని ఆయా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసి అక్కడి ప్రజల మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేశారు. ఈనేపథ్యంలో గిరిజన ప్రాంతంపై మరింత ప్రత్యేక శ్రద్ధతో ప్రతి సచివాలయానికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేసి గిరిజన గ్రామాలను అభివృద్ధి చేశారు. ఈ నిధులతో ఎమ్మెల్యే బాలరాజు పలు గ్రామాల్లో అంతర్గత రహదారులను సీసీ రహదారులుగా అభివృద్ధి చేసి ప్రారంభించారు. పలుచోట్ల సీసీ డ్రెయిన్లు నిర్మించారు.

నియోజకవర్గంలో 252 పనులు

పోలవరం నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో పర్యటించిన ప్రజాప్రతినిధుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి సచివాలయ పరిధిలో రూ.40 లక్షల చొప్పున నిధులు కేటాయించింది. ఈ నిధులతో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు, కొయ్యలగూడెం, టి.నర్సాపురం మండలాల పరిధిలో 252 పనుల వరకూ చేపట్టినట్లు అధికారులు చెప్పారు. వీటిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు ఉన్నాయి. సీసీ రోడ్లు దాదాపుగా పూర్తయినట్లు అధికారులు తెలిపారు. పూర్తయిన రోడ్లను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ఎన్నికల కోడ్‌కు ముందే ప్రారంభించడం జరిగింది.

టీడీపీ హయాంలో అధ్వానంగా రోడ్లు

గత టీడీపీ ప్రభుత్వ పాలనలో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండేవి. దీంతో ప్రజలు అనేక అవస్థలు పడేవారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గడపగడపకు కార్యక్రమం ద్వారా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే తెల్లం బాలరాజు రహదారుల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో ఏర్పడిన సీసీ రహదారులతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించాం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాల్లోని సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనుల కోసం ప్రజలు నా దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం కేటాయించిన రూ.40 లక్షల నిధులతో నియోజకవర్గంలో 252 గ్రామాల్లో పనులు పూర్తి చేసేందుకు కృషి చేశాం. అన్ని గ్రామాల్లో కూడా సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి రాబోయే రోజుల్లో కృషి చేస్తా.

– తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం

ఇబ్బందులు తొలగాయి



గతంలో గ్రామాల్లో సరైన రహదారి లేక ఇబ్బందులు పడేవారు. అయితే ప్రతి సచివాలయం పరిధిలో ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు సీఎం జగనన్న రూ.40 లక్షల నిధులు కేటాయించారు. ఈ నిధులతో మా సచివాలయ పరిధిలో సీసీ రోడ్ల పనులు పూర్తి చేసి ప్రారంభించాం. దీనితో గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందులు తొలగాయి.

– ఉయికే బొజ్జి, సర్పంచ్, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం



కుక్కునూరు సంజయ్ నగర్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు



కేఆర్‌పురంలో నిర్మించిన సీసీ రోడ్డు



బుట్టాయగూడెం మండలం ఇప్పలపాడులో నిర్మించిన సీసీ రోడ్డు

పారిజాతగిరిలో ఉగాది వేడుకలు



విశేషాలంకరణలో శ్రీవారు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం నుంచి విశేషపూజలు నిర్వహించారు. 108 బంగారు పుష్పాలతో పూజ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు పంచాంగ పఠనం గావించారు. ఆలయ ఈవో పంచాంగం పుస్తకాలను భక్తులకు పంచిపెట్టారు. వేగవరానికి చెందిన అట్లూరి శ్రీనివాసరావు కుటుంబసభ్యులు ఉగాది పచ్చడి, ప్రసాద వితరణ జరిపించారు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: శ్రీ వల్లీ దేవసేన సమేత సుందర బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సుమారు 2 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఇందుకు దాతలు చిక్కాల శ్రీవెంకట రామారావు, తలప్రోలు నూకరాజు, వేములపూడి అచ్చారావు కుటుంబ సభ్యులు సహకరించినట్లు కమిటీ అధ్యక్షుడు కానూరి గంగాధరారవు తెలిపారు.

ప్రజా ప్రభుత్వాన్ని మరోసారి స్వాగతించాలి



రాయిన్నపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న కంభం విజయరాజు



భోగోలులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు, పార్టీ శ్రేణులు

- వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు
- లింగపాలెం మండలంలో ఎన్నికల ప్రచారం

లింగపాలెం: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పాలన అందించే సత్తా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే మాత్రమే ఉందని వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. సోమవారం మండలంలోని భోగోలు, రాయన్నపాలెం గ్రామాల్లో సర్పంచ్ తాడేపల్లి శాంతరావు ఆధ్వర్యంలో విజయరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు పెద్ద ఎత్తున ప్రజలు, మహిళలు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. హారతులు ఇచ్చి పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ ప్రజాప్రభుత్వాన్ని మరోసారి స్వాగతించాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన వైఎస్ జగన్‌కు మళ్లీ పట్టం కట్టాలని కోరారు. టీడీపీ కుట్రల కారణంగానే ఈ నెలలో పింఛన్లు తీసుకునేందుకు అవ్వాతాతలు ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు కల్లబొల్లి మాటలను నమ్మవద్దని, ప్రతి ఒక్కరూ తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, పార్టీ నాయకులు ఇనుగంటి సతీష్‌బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, పార్టీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు చలగుళ్ల రవిబాబు, కె రమేష్, డి రవీంద్ర, ధర్మాజీగూడెం, రంగాపురం సొసైటీ చైర్మన్లు ఉప్పలపాటి వరప్రసాద్, రెడ్డిన శ్రీను, మండల బూత్ కన్వీనర్ ఉప్పలపాటి గోపి, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, కోకన్వీనర్ రెడ్డి ప్రవీణ్, నాయకులు ఏపూరి సూరిబాబు, రావి కొండయ్య, మందలపు నరసింహారావు, కర్లపూడి ఆనంద్, బి.ప్రభాకరెడ్డి, ఓ ప్రభాకరావు, కె రఘు, కట్టా సత్యన్నారాయణ, పి.వేమనరెడ్డి, జి.నూతలపాటి శ్రీను, చిన్నరంగారావు, బి లింగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచారం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని 25వ వార్డులో బుధవారం ఉదయం 7 గంటల నుంచి వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పాల్గొంటారని, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


కండిగలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి వనిత

ద్వారకాతిరుమల: గుండుగొలనుకుంటలో చిలుకూరి ధర్మారావు తోటలో కొలువైన శ్రీ కండిగలమ్మ, పోతురాజు స్వామి వార్ల ఆలయంలో అమ్మవారి ఉత్సవ మూర్తిని మంగళవారం ప్రతిష్ఠించారు. ఈ వేడుక భక్తులకు నేత్రపర్వమైంది. కాగా రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత ఈ ఆలయాన్ని రాత్రి సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆమెకు ధర్మారావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవారికి పూజలు నిర్వహించి, పసుపు, కుంకుమలను సమర్పించారు. సర్పంచ్ బందారు ధనలక్ష్మి, అచ్యుత ఏసుబాబు దంపతులు, తేలు వెంకటేశ్వరరావు, చిలుకూరి నాగవెంకట ఫణికుమార్, చిలుకూరి నరసింహమూర్తి, చిలుకూరి వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు



సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

బుట్టాయగూడెం: జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, పోలవరం డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి ఆదేశాలతో జీలుగుమిల్లి సీఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ముద్దప్పగూడెం గ్రామ సమీపంలో సారా తయారీ కేంద్రాలపై మంగళవారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.వెంకన్న తెలిపారు. అదేవిధంగా స్థావరాల్లో కాస్తున్న నాటుసారా, 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కోడిపందేలపై దాడులు

పోలవరం రూరల్: పోలవరం మండలం చేగొండిపల్లి గ్రామ సమీపంలో పొలాల్లో నిర్వహిస్తున్న కోడి పందేలపై పోలీసులు దాడులు నిర్వహించారు. పోలవరం సీఐ ఎం.మధుబాబు ఆధ్వర్యంలో ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు చేపట్టారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.24,900, రెండు కోడిపుంజులు, కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం


టి.నరసాపురం: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు తదితర పనులను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తామని, ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఊరూరా ఘనంగా ఉగాది వేడుకలు

- అమ్మవార్లకు విశేష పూజలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు
- ఆకట్టుకున్న గిరిజన సంప్రదాయ నృత్యాలు



జంగారెడ్డిగూడెం: విశేష అలంకరణలో నూకాలమ్మ



జంగారెడ్డిగూడెం: గంగానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం: విజయదుర్గమ్మకు పసుపు, కుంకుమలతో నైవేద్యాలు



జంగారెడ్డిగూడెం: ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ



బుట్టాయగూడెం: దుద్దుకూరులో వనదుర్గకు పూజలు చేస్తున్న రాజ్యలక్ష్మి



టి.నరసాపురం: రంగనాథ శర్మ పంచాంగ శ్రవణం



కొయ్యలగూడెం: బయ్యనగూడెంలోని ముత్యాలమ్మ తల్లి మూలవిరాట్‌కు జలాభిషేకం చేస్తున్న భక్తులు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన పల్లెల్లో మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఊరూరా ఉగాది పండుగతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే పురోహితులు పలుచోట్ల ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పంచాంగం చదివి వినిపించారు. అయితే గిరిజన గూడెంలో మాత్రం ఈ ఉగాది వేడుకలు భిన్నంగా జరిగాయి. కొండ దేవతలకు ఘనంగా పూజలు చేశారు. పలు గ్రామాల్లోని గ్రామ దేవతలు గంగానమ్మ, గుబ్బల మంగమ్మ, ముత్యాలమ్మ, నాగులమ్మ, కనక దుర్గమ్మ, పోచమ్మ తల్లి తదితర దేవతలకు ఘనంగా పూజలు నిర్వహించారు. ముఖ్యంగా ముప్పినవారిగూడెం సమీపంలో ఉన్న కడియలమ్మ అమ్మవారి గుడి వద్ద ఉగాది వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అలాగే కణితి ఆడపడుచుగా అమ్మవారు ఉండడంతో సీతప్పగూడెంలోని కణితి కుటుంబానికి చెందిన వారంతా అమ్మవారికి చీర, సారె తీసుకువచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన గిరిజన సంప్రదాయ నృత్యాల్లో గిరిజన మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దాసియ్యపాలెంలో సమ్మక్క, సారక్క అమ్మవార్లకు అక్కడి గిరిజనులు అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. సోదెం అనే ఇంటి పేరుకు చెందిన వారంతా అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించగా తెల్లం వారు వియ్యంకులుగా వ్యవహరించారు. బుట్టాయగూడెం గంగానమ్మ అమ్మవారిని గ్రామంలో ఘనంగా ఊరేగించారు.

పూజలు చేసిన ఎమ్మెల్యే దంపతులు

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని దుద్దుకూరులో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రోధి నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో...

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నూకాలమ్మ తల్లి 60వ ఉగాది వార్షిక జాతర మహోత్సవంలో భాగంగా మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కళ్యాణ కళావేదిక వద్ద వేదపండితులు గుండూరి సత్యకిరణ్ శాస్త్రి శ్రీక్రోధి నామ సంవత్సర పంచాంగశ్రవణం చేశారు. వీరంపాలెం శ్రీ బాలా త్రిపురసుందరీ పీఠం ఆధ్యాత్మిక సేవా ప్రతినిధి ఈమని శశికుమార్ ఉగాది విశిష్టతను తెలియజేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. పట్టణ గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. విజయదుర్గమ్మ ఆలయంలో గోపూజ నిర్వహించారు. ఆలయ మహిళా కమిటీ సభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు, పుసుపు, కుంకుమ, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి శోభాయాత్ర నిర్వహించారు. పంచాంగ శ్రవణం కార్యక్రమం అనంతరం 25 మంది బ్రాహ్మణులను సత్కరించారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక వేడుకలు మంగళవారం మహాన్నదాన కార్యక్రమంతో ముగిసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. కాగా మంగళవారం ఉగాది సందర్భంగా ఆలయంలో పంచాంగ శ్రవణం ప్రధానార్చకులు మిర్తిపాటి విశ్వనాథ్ శ్రీనివాస్ నిర్వహించారు. అమ్మవారికి వెండి పాదపీఠ సహిత సింహాసనం కోసం రాజమండ్రికి చెందిన తమ్మా శ్రీరామ్, ఇంద్రాణి దంపతులు కేజీ వెండిని బహూకరించారు.

ముత్యాలమ్మకు జలాభిషేకం

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలోని శ్రీ ముత్యాలమ్మకు మంగళవారం భక్తులు జలాభిషేకం సర్వహించారు. అమ్మవారికి నైవేద్య పొంగళ్లను ప్రసాదంగా సమర్పించిన అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అనంతరం ఆలయంలో పారాయణ, భక్తి రంజని కార్యక్రమాలు నిర్వహించారు.

టి.నరసాపురంలో...

టి.నరసాపురం: ఉగాది పండుగను మండల ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల వద్ద వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. ప్రధానంగా టి.నరసాపురం కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద వేదపండితులు రంగనాథ శర్మ పంచాంగ శ్రవణం చేసి రాశిఫలాలను తెలియజేశారు. రాశుల వారీగా ఆదాయ, వ్యయాలు, రాజపూజ్య, అవమానాలు తదితర విషయాలను భక్తులకు వివరించారు.